ప్రజాశక్తి
సోమవారం 16 సెప్టెంబర్ 2024
8 పేజీలు


విశాఖపట్నం


అనకాపల్లి


మహాధర్నాలో మాట్లాడుతున్న జగ్గునాయుడు, చిత్రంలో లోకనాథం, తదితరులు

'ఉక్కు' రక్షణకు..

మోడీ ప్రభుత్వాన్ని నిలదీయండి

◆ టిడిపి, జనసేనలకు సిపిఎం డిమాండ్ ◆ పాత గాజువాకలో మహా ధర్నా

మోడీ ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని రోజురోజుకూ ధ్వంసం చేస్తోందని, కావాలనే నష్టాల్లోకి నెట్టి ఆదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెట్టే కుట్రలు పన్నుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. ప్లాంట్ పూర్తిగా మునిగిపోకముందే టిడిపి, జనసేనలు కేంద్రంలో మోడీ ప్రభుత్వాన్ని నిలదీసి ప్లాంట్ పరిరక్షణకు పూనుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన పాత గాజువాక జంక్షన్‌లో ఆదివారం మహా ధర్నా జరిగింది. పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, కార్మికులు, ప్రజలు, యువత పాల్గొన్నారు. సిపిఎం నేతల ప్రసంగాలు ఉక్కు పరిరక్షణకు ఉద్యమ స్ఫూర్తిని రగిల్చాయి.

(ప్రధాన వార్త మెయిన్‌లో..)

కార్మికుల భద్రతకు సిపిఎం రక్షణ యాత్ర

◆ నేటి నుంచి బైకు ర్యాలీ ప్రారంభం
◆ 239 కిలోమీటర్లు సాగనున్న యాత్ర ◆ 20న అచ్యుతాపురంలో సభ
◆ పరిశ్రమల్లో ప్రమాదాలపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో జరుగుతున్న పారిశ్రామిక ప్రమాదాల మూల కారణాలను ప్రజలకు తెలియజేసి, అవగాహన కల్పించేందుకు బైక్ ర్యాలీకి సిపిఎం సమాయత్తమైంది. సెజ్, ఫార్మాలో ఉద్యోగులు, కార్మికుల భద్రతకు సోమవారం నుంచి గ్రామాల్లో రక్షణ యాత్ర చేపట్టనుంది. ఈ నెల 20 వరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం నేతృత్వంలో ఆర్.శంకరరావు, శివాజీ, సోమునాయుడు, రమణ చేపట్టనున్న ఈ బైక్ ర్యాలీని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.జగ్గునాయుడు ప్రారంభించనున్నారు. రక్షణ యాత్ర సోమవారం ఉదయం 10 గంటలకు పాయకరావుపేటలోని మంగవరం జంక్షన్ వద్ద ప్రారంభమై 20న సాయంత్రం 4 గంటలకు అచ్యుతాపురంలో బహిరంగసభతో ముగియనుంది.

పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, యలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ మండలాల్లోని 62 గ్రామాల గుండా ఈ బైక్ యాత్ర సాగనుంది. 239 కిలోమీటర్లలో సాగే ఈ రక్షణ యాత్ర సెజ్, ఫార్మా, ఎన్ఎఒబి నిర్వాసిత బాధిత గ్రామాలు, కార్మికులు, ఉద్యోగుల నివాసిత గ్రామాల మీదుగా వెళ్లనుంది.

పారిశ్రామిక ప్రమాదాల నియంత్రణకు ప్రజలను భాగస్వాములు చేసేందుకు సిపిఎం చేపట్టే ఈ యాత్రకు ఎంతో ప్రాధాన్యత వుంది. పారిశ్రామికాభివృద్ధి పేరుతో యాజమాన్యాలకు అనుకూలమైన విధానాలను అమలుచేస్తున్న ప్రభుత్వాలు ఆ పరిశ్రమలకు భూములు ఇచ్చిన గ్రామాలకు, నిర్వాసిత కుటుంబాలకు, పరిశ్రమల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు అన్యాయం చేస్తున్నాయి. నిర్వాసిత కుటుంబాలు, స్థానికులకు పరిశ్రమల్లో శాశ్వత ఉపాధి ఇవ్వడంలేదు. వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చి పనిచేసిన ఉద్యోగులు, కార్మికులకు కనీస రక్షణ, భద్రత కొరవడ్డాయి. కంపెనీల నుంచి ఇంటికి సురక్షితంగా వెళ్తామన్న భరోసా లేకుండా పోయింది. ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులను ఆదుకోవాలన్న ఆలోచన ప్రభుత్వాలకు కలగడంలేదు. ప్రమాదాల నియంత్రణకు శ్రద్ధ తీసుకోని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ఉదారంగా వ్యవహరిస్తున్నాయి. కార్మికుల మరణాలు, గాయాలకు కారణమైన యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకొని పొరపాట్లను సరిచేసే కనీస ప్రయత్నం చేయడంలేదు. ఉద్యోగులు, కార్మికుల మిగతా 2లో..

ఏలేరు కాలువకు గండి

▶ వార్త మెయిన్‌లో..

'వైశాఖి'లో రూ.40 కోట్లతో టూరిజం ప్రాజెక్టు

▶ వార్త 2లో..

నడి సంద్రంలో ఫిషింగ్ బోటు దగ్ధం

▶ వార్త మెయిన్‌లో...

విశాఖకు నాలుగో వందే భారత్

◆ నేడు ప్రారంభించనున్న ప్రధాని మోడీ
◆ దుర్గ్ - విశాఖ మధ్య సేవలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వివిధ రైల్వే ప్రాజెక్టుల్లో భాగంగా గుజరాత్ నుంచి ఆరు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు దేశంలోనే మొట్టమొదటి వందే మెట్రోను ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం ప్రారంభించనున్నారని, వీటిలో రాయ్‌పూర్ (దుర్గ్) - విశాఖపట్నం వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఉందని ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ సీనియర్ కమర్షియల్ డివిజనల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. ఈ క్రమంలో దుర్గ్ - విశాఖపట్నం వందే భారత్ రైలు ప్రయాణికులకు ఎంతగానో ఉపయోగపడనుందని వెల్లడించారు. ఇప్పటికే విశాఖపట్నం - సికింద్రాబాద్, భువనేశ్వర్ - విశాఖపట్నం, సికింద్రాబాద్ - విశాఖపట్నం మధ్య మూడు వందేభారత్ రైళ్లు సేవలు అందిస్తుండగా ఇది నాలుగో రైలు అవుతుందని వెల్లడించారు. ఈ రైలు రాయపూర్ - విజయనగరం మార్గంలో మొదటి వందే భారత్ రైలు అని పేర్కొన్నారు

20829/20830 దుర్గ్-విశాఖపట్నం-దుర్గ్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్

20829 దుర్గ్ -విశాఖపట్నం వందే భారత్ సెప్టెంబర్ 20 నుంచి వారానికి ఆరు రోజులు (గురువారాలు మినహా) ఉదయం 5.45 గంటలకు దుర్గ్ నుండి బయలుదేరి అదే రోజు మధ్యాహ్నం 13.45 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

20830 విశాఖపట్నం - దుర్గ్ వందే భారత్ సెప్టెంబర్ 20వ తేదీ నుండి వారానికి 6 రోజులు (గురువారాలు మినహా) మధ్యాహ్నం 14.50 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి అదేరోజు రాత్రి 22.50 గంటలకు దుర్గ్ చేరుకుంటుంది. ఈ రైళ్లు రాయ్‌పూర్, మహాసముంద్, ఖరియార్ రోడ్, కాంతబంజి, టిట్లాగఢ్, కేసింగ, రాయగడ, పార్వతీపురం, విజయనగరం మీదుగా ప్రయాణిస్తాయి.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి

◆ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
◆ 'ప్రజాశక్తి'తో అనకాపల్లి జిల్లా మత్స్యశాఖ అధికారి ప్రసాదరావు

ప్రజాశక్తి - అనకాపల్లి : మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని, వారికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అనకాపల్లి జిల్లా మత్స్యశాఖ అధికారి ప్రసాదరావు అన్నారు. జిల్లాలో మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అమలు చేస్తున్న రాయితీలు, ఆక్వా కల్చర్ పరిస్థితిని ఆయన 'ప్రజాశక్తి'కి తెలియజేశారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

జిల్లాలో ఏయే ప్రాంతాల్లో మత్స్యకారులు ఉన్నారు ?

అనకాపల్లి జిల్లాలో ఆరు కోస్టల్ మండలాలు ఉన్నాయి. సముద్ర తీర ప్రాంతంలో పాయకరావుపేట, నక్కపల్లి, రాంబిల్లి, ఎస్.రాయవరం, అచ్యుతాపురం, పరవాడ మండలాలు ఉన్నాయి. సుమారు 80 వేల మంది మత్స్యకారులు ఉండగా వారిలో 13 వేల మంది సముద్ర వేటకు వెళ్తున్నారు.

ఆక్వాకల్చర్ పరిస్థితి ఏంటి ?



జిల్లాలో ఆక్వా కల్చర్ రెండు వేల ఎకరాల్లో 160 మంది రైతులు చేపడుతున్నారు. ప్రభుత్వం రూపాయి 50 పైసలకే యూనిట్ విద్యుత్‌ను వారికి సరఫరా చేస్తోంది. ఆక్వా జోన్‌లో ఎన్ని చెరువులు ఉన్నా అందరికీ అమలు చేస్తున్నాం.



ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం గురించి వివరించగలరు ?

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

మత్స్యకారుల అభివృద్ధికి కృషి

50 వేల రూపాయల యూనిట్‌గా 40 శాతం రాయితీపై బోట్లు, 50 వేల రూపాయలకే వలలు, లక్ష రూపాయలకే ఇంజిన్లు ఇస్తున్నాం. అలాగే చేపల వ్యాపారం నిర్వహించే వారికి ద్విచక్ర, త్రి చక్ర వాహనాలు, నాలుగు చక్రాల వాహనాలు అందిస్తున్నాం. 40 శాతం రాయితీపై చేప పిల్లలు పంపిణీ చేస్తున్నాం. ఆక్వా కల్చర్‌లో భాగంగా హెక్టారుకు 1000 చేప పిల్లలను ఒక్కో చేప పిల్లను రూపాయి 75 పైసలకు ఇస్తున్నాం.

ఎస్‌సి, ఎస్‌టి, బిసి తరగతులకు అమలు చేస్తున్న పథకాలు ఏంటి ?

ఎస్‌సి, ఎస్‌టి, మహిళలకు 60 శాతం రాయితీపైనా, బిసిలకు 40 శాతం రాయితీపైనా చేప పిల్లలు ఇస్తున్నాం. గత ఏడాది 23 లక్షల చేప పిల్లలను జిల్లాలో ఇవ్వగా ఈ ఏడాది 25 లక్షలు ఇచ్చేందుకు ప్రతిపాదనలు తయారు చేశాం.

కార్మికుల భద్రతకు సిపిఎం రక్షణ యాత్ర

ప్రాణాలకు పరిహారం చెల్లించడమే మానవీయతగా చెప్తుకుంటున్నాయి తప్ప తమ నిర్లక్ష్యంతో కుటుంబాలను పోషించే పెద్ద దిక్కు కోల్పోయారన్న పశ్చాత్తాపం వారిలో ఏ మాత్రమూ కన్పించడంలేదు. పరిహారం కూడా సిపిఎం, సిఐటియు జోక్యం చేసుకున్నచోట, పోరాడిన చోటనే బాధిత కుటుంబాలకు యాజమాన్యాలు చెల్లిస్తున్నాయి. పరిశ్రమల్లో తరచూ జరుగుతున్న ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు, కాలుష్య బారిన ప్రజలు పడకుండా యాజమాన్యాలు పాటించాల్సిన పద్ధతులను ప్రజలకు గ్రామగ్రామానా వివరించేందుకు సిపిఎం ఈ బైక్ ర్యాలీ చేపట్టింది.

యాజమాన్యాల పట్ల ఉదాసీనత వీడాలి

అనకాపల్లి జిల్లా భవిష్యత్తులో పారిశ్రామికంగా విస్తరించనుంది. ప్రస్తుతం పరిశ్రమల్లోని ఉద్యోగులు, కార్మికులకు భద్రతలేదు. సేఫ్టీ ఆడిట్ క్రమబద్ధం జరిగేలా చూడాలి. థర్డ్ పార్టీ ఆడిట్ నిర్వహించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉదాసీనంగా వుండకుండా ప్రమాదాలకు కారణమైన యాజమాన్యాల పట్ల కఠినంగా వ్యవహరించాలి. ప్రమాదాలు జరగకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిశ్రమల్లో ఉపయోగించేలా ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి. నిర్వాసిత కుటుంబాల వారికి, స్థానిక యువతకు శాశ్వత ఉద్యోగాలను పరిశ్రమల్లో కల్పించాలి. కాలుష్యం లేకుండా చర్యలు తీసుకోవాలి. పరిశ్రమల ప్రమాదాలపై ప్రజలకు వాస్తవాలు వివరించేందుకు ఈ బైక్ ర్యాలీ చేపడుతున్నాం.

కె.లోకనాథం,
సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి

కెజిహెచ్ ప్లాస్టిక్ సర్జరీ వార్డు ఆధునికీకరణకు..

హెచ్‌పిసిఎల్ రూ.కోటీ 20 లక్షలు సాయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లోని ప్లాస్టిక్ సర్జరీ విభాగాన్ని ఆధునికీకరించనున్నారు. అదే విభాగంలో ప్రత్యేకంగా బర్న్స్ వార్డును ఏర్పాటు చేయనున్నారు. బర్న్స్ వార్డు ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పిసిఎల్) కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా రూ.కోటీ 20 లక్షలు ఇచ్చేందుకు జిల్లా కలెక్టర్‌తో అవగాహన కుదుర్చుకుంది. ఇటీవల ఉమ్మడి విశాఖ జిల్లాలో ముఖ్యంగా ఇటు విశాఖ, అటు అనకాపల్లి జిల్లాలలో పలు ప్రైవేట్ పరిశ్రమలలో పెద్ద ఎత్తున అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల్లో పదుల సంఖ్యలో కార్మికులు మృత్యువాత పడుతున్నారు. కార్మికులు తీవ్రంగా గాయాలు పాలవుతున్నారు. అటువంటి క్షతగాత్రులను కెజిహెచ్‌కు కాకుండా ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులకు తరలిస్తున్నారు. కెజిహెచ్‌లో ప్లాస్టిక్ సర్జరీ విభాగం, భరత్ వార్డు ఉన్నప్పటికీ, అటువంటి క్షతగాత్రులకు అవసరమైన మేరకు వైద్య సేవలు అందించడానికి ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో లేవు. ప్రత్యేకంగా ఐసియు ఆక్సిజన్ బెడ్స్, వెంటిలేటర్ బెడ్స్ కెజిహెచ్‌లో లేకపోవడం పెద్ద లోపం. ఈ పూర్వ రంగంలో కెజిహెచ్ బర్న్స్ వార్డును తక్షణం ఆధునికీకరణ చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ పరిస్థితిని గుర్తించిన నేపథ్యంలో హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ ముందడుగు వేసిందని భావించవచ్చు. ఈ సంస్థ సమకూర్చే నిధులతో బర్న్స్ వార్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసే అవకాశాలు లేనప్పటికీ, ఉన్నంతలో మెరుగైన వసతులు కల్పించే వీలుంటుందని తెలుస్తోంది. ఈ విషయమై కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానందను సంప్రదించగా పలు విషయాలు తెలిపారు.

కెజిహెచ్ బర్న్స్ వార్డులో ఆక్సిజన్ బెడ్స్, వెంటిలేటర్ బెడ్స్ ఏర్పాటుతోపాటు అగ్ని ప్రమాదంలో గాయపడి కెజిహెచ్‌కు వచ్చే క్షతగాత్రులకు సరైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా ప్రత్యేకంగా ఆపరేషన్ పరికరాలను కొనుగోలు చేయనున్నామన్నారు. కంటిన్యూ మోనిటరింగ్ కోసం రెండు మినీ థియేటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. బోన్స్ డ్రెస్సింగ్, చిన్న చిన్న సర్జరీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. హెచ్‌పిసిఎల్ ఇచ్చే నిధులు సరిపోతాయా అంటే, ఇంకా అవసరం ఉంటుందని, కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లామని తెలిపారు. కెజిహెచ్‌లో బర్న్స్ వార్డు నిర్వహణకు అవసరమైన డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నారని వెల్లడించారు.

17న టిఎస్ఆర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి జన్మదిన వేడుకలు తెలుగు శక్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నామని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఈ జన్మదిన వేడుకలు వాల్తేర్ అప్ ల్యాండ్స్‌లోని టిఎస్ఆర్ గృహంలో ఉదయం 9 గంటలకు ఘనంగా ప్రారంభంకానున్నాయని పేర్కొన్నారు. ఆయన అభిమానులు, శ్రేయోభిలాషులు, మిత్రులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

వైశాఖి జల ఉద్యాన వనంలో

రూ.40 కోట్లతో టూరిజం ప్రాజెక్టు

ప్రణాళికలు సిద్ధం చేసిన విఎంఆర్‌డిఎ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పాత నగరంలో గుర్తింపు పొందిన వైశాఖి జల ఉద్యానవనానికి మహర్దశ పట్టనుంది. దాదాపు రెండేళ్లుగా ఇది మూతపడింది. మూడు అంతస్తులతో ఇక్కడ ఉన్న భవనంలో తరచూ అనేక శుభకార్యాలు, సభలు సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతూ ఉండేవి. అటువంటిది, దీనిని నిర్వహిస్తున్న కాంట్రాక్టర్‌ను విఎంఆర్‌డిఎ అధికారులు అర్ధాంతరంగా తొలగించి, దీనిని స్వాధీనం చేసుకున్నారు. దాదాపు రెండేళ్ళ క్రితం దీనికి సీలు వేశారు. అప్పటినుంచి ఇది మూతపడి, ఇక్కడ ఉన్న భవనాలు, వాటిలో ఉన్న ఏసీలు, ఫర్నీచర్, ఇతర పరికరాలు పూర్తిగా నిరుపయోగంగా ఉన్నాయి. ఇదే అదనుగా కొందరు అక్రమంగా లోపలికి ప్రవేశించి ఇటువంటి విలువైన పరికరాలను దొంగిలించినట్లు కూడా తెలుస్తోంది. ఇది మూతపడిన తర్వాత నుంచి తిరిగి దీనిని తెరిపించాలని, అవసరమైతే ఆధునికీకరించాలని అనేకమంది కోరుతూ వచ్చారు. అయితే గత ప్రభుత్వం అంతగా పట్టించుకోలేదు. సుమారు మూడు ఎకరాల 40 సెంట్లు స్థలంలో ఉన్న ఉద్యానవనంలో సుమారు 40 సెంట్లు స్థలాన్ని ఉడా ఉన్నప్పుడు పోలీసు శాఖకు అప్పగించగా పోలీస్ శాఖ కార్యాలయాల భవనాలను ఆ స్థలంలో నిర్మించారు. పూర్తిగా చెరువుగా ఉండే ఈ ప్రాంతంలో ప్రజలకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దే పనిని 2000 సంవత్సరంలో రూ.50 లక్షలకు కాంట్రాక్టుకు అప్పగించారు. కాంట్రాక్టుకు తీసుకున్న వ్యక్తి పిపిపి పద్ధతిలో ఈ స్థలంలో మూడంతస్తుల భవనం నిర్మాణంతో పాటు వాటికి అవసరమైన ఫర్నీచర్ వగైరా ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. అంతేగాకుండా భవనాలకు అటు ఇటు ఉన్న



వైశాఖి జల ఉద్యానవనం ముఖద్వారం

లోతట్టు ప్రాంతంలో కొలనుగా ఉన్న ప్రదేశంలో బోటు షికారు ఏర్పాటు చేశారు. అలాగే భవనం నుంచి కుడివైపున ఉన్న స్థలం వరకు ఈ కొలను భాగంలో రోప్ వే ఏర్పాటు చేశారు. ఒక భవనంలో వీడియో గేమ్స్ ఏర్పాటు చేసి కమర్షియల్‌గా దీనిని నిర్వహించే ఏర్పాటు చేశారు. మొదటిసారి 9 ఏళ్లపాటు, అలాగే మరో రెండు పర్యాయాలు, అంటే మొత్తం 27 సంవత్సరాల పాటు చిట్టిబాబు అనే వ్యక్తికి కాంట్రాక్టు అప్పగించారు. ఈ ప్రాజెక్టు నిర్మించిన ఆయనకే కాంట్రాక్ట్ దక్కింది. మొదటగా 2009 వరకు అగ్రిమెంట్ ప్రకారం కొనసాగిన ఆయనకు మరో 9 ఏళ్ల పాటు రెన్యువల్ చేస్తూ వుడా అవకాశం కల్పించింది. ఆయన 2027 వరకు కొనసాగవలసి ఉండగా, అర్ధాంతరంగా 2022లో విఎంఆర్‌డిఎ ఆయనకు నోటీసు ఇచ్చి తొలగించింది. అగ్రిమెంట్ ప్రకారం తాను 2027 వరకు ఉండాలని, అలాగే తాను అగ్రిమెంట్ నుంచి వైదొలిగితే అక్కడ ఉన్న మొత్తం అన్ని పరికరాలను తీసుకోవలసి ఉంటుందని కాంట్రాక్టర్ మొత్తుకున్నా విఎంఆర్‌డిఎ అధికారులు అయిన మొర వినలేదు. దీంతో ఒకప్పుడు ఎంతో వైభవంగా కొనసాగిన వైశాఖి జల ఉద్యానవనం ఇప్పుడు శ్మశానాన్ని గుర్తు చేస్తోంది.

ఈ నేపథ్యంలో విఎంఆర్‌డిఎ దీనిని ఆధునీకరించాలని, ప్రత్యేకంగా టూరిజం ప్రాజెక్టును నిర్మించాలని, అందులో భాగంగా రెస్టారెంట్, సందర్శకులను ఆకట్టుకునే విధంగా పలు ప్రాజెక్టులను అమలు చేయాలని నిర్ణయించింది. అందుకోసం రూ.40 కోట్లతో ఒక ప్రణాళికను రూపొందించింది. అనుకున్న విధంగా ఈ ప్రణాళిక అమల్లోకి వస్తే వైశాఖి జల ఉద్యానవనానికి మహర్దశ వస్తుందని భావించవచ్చు.

ఘనంగా మోటార్ మెకానిక్స్ అసోసియేషన్ వార్షికోత్సవం

కంపెనీల ఉత్పత్తులతో ప్రత్యేక స్టాల్స్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ స్కూటర్స్, మోటార్ సైకిల్స్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 43వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కాన్వెంట్ జంక్షన్ వద్ద ఉన్న అసోసియేషన్ కార్యాలయం ప్రాంగణంలో జరిగిన వేడుకలకు విశాఖ ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, పి.గణబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపి శ్రీ భరత్ మాట్లాడుతూ బైక్ నడపటం తనకు భయం అని, కార్లు ఉండడం వల్ల బైక్ నడిపే పరిస్థితి రాలేదని అన్నారు. సమాజంలో మెకానిక్ పాత్ర కీలకమన్నారు. మెకానిక్‌ల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ మెకానిక్‌లు లేకపోతే రోడ్డుపై వాహనాలు తిరిగే పరిస్థితి లేదన్నారు. మెకానిక్‌లకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు బింగి రాజిరెడ్డి మాట్లాడుతూ మెకానిక్‌లకు జివిఎంసి నుంచి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, భవన కార్మికుల జాబితాలో తమను చేర్చాలని కోరారు. టెక్నాలజీకి అనుగుణంగా మెకానిక్‌లకు శిక్షణ తరగతులు నిర్వహించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం తమను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీలు తమ ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో మోటార్ సైకిల్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎల్లపు రఘురామ్, అసోసియేషన్ కార్యదర్శి వివి.సత్యనారాయణ, ఎన్.శ్రీనివాస్ రెడ్డి ,రవి వర్మ, నర్సింగ్, వాసు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల అన్నదానం



లాసన్స్ బే కాలనీలో ఏర్పాటు చేసిన అన్నదానం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎంవిపి కాలనీ సెక్టార్ - 11 లాసన్స్ బే ఏరియాలో నవ్య కన్‌స్ట్రక్షన్స్ వారి ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా గణేష్ పూజా మహోత్సవాలను నిర్వహించారు. 2500 మందికి అన్నదానం చేశారు. విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు స్వామివారిని దర్శించుకొని భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం వినాయకుని అనుపు ఉత్సవం ఘనంగా సాగిందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మన్యం విజయకుమార్ తెలియజేశారు. కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అన్నసమారాధనలో సర్పంచ్ గున్నయ్యనాయుడు

కశింకోట : మండలంలోని ఉగ్గినపాలెం గ్రామంలో ఆదివారం వినాయక ఉత్సవాల్లో అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి కలగా లక్ష్మి, సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు పాల్గొని అన్నసంతర్పణకు ఆర్థికసాయం అందించిన కెజిఎన్ యువసేన సభ్యులను అభినందించారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి యోగా పోటీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : యోగా ద్వారా పరిపూర్ణమైన ఆరోగ్యం సమకూరుతుందని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సన్ స్కూల్‌కు అనుకొని ఉన్న క్రీడా మైదానంలో విశాఖ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన 49వ రాష్ట్ర స్థాయి యోగా పోటీలు శనివారం ప్రారంభమై ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ, చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్య అనేది ఉద్యోగం, ఉపాధి కోసమే గాకుండా వ్యక్తిత్వాన్ని, సంస్కారాన్ని పెంచేదిగా ఉండాలన్నారు. వ్యక్తి ఎదుగుదలలో వ్యక్తిత్వం ప్రధానమైనదిగా స్పష్టం చేశారు. విజేతలకు ఎమ్మెల్యే సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, జివిఎంసి రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి, సన్ స్కూల్ విద్యా సంస్థ అధినేత కె.శ్రీనివాసరావు, టిడిపి నాయకులు గంటా నూక రాజు, యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ఇఆర్‌కె వర్మ, కార్యదర్శి ఎం.అవినాష్, జిల్లా అధ్యక్షులు రవి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రామారావు, సహాయ కార్యదర్శి ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓవరాల్ ఛాంపియన్‌గా విశాఖ

రెండ్రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్ షిప్‌గా 154 పాయింట్లతో విశాఖ జిల్లా జట్టు నిలిచినట్లు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అవినాష్ తెలిపారు. 150 పాయింట్లతో రెండో స్థానంలో కృష్ణా జిల్లా జట్టు, 149 పాయింట్లతో మూడో స్థానంలో కర్నూలు జిల్లా జట్టు నిలిచాయని పేర్కొన్నారు. ఉమ్మడి ఏపిలోని 13 జిల్లాల నుంచి 8 ఏళ్ల నుంచి 45 ఏళ్ల లోపు ఉన్న 473 మంది రెండ్రోజులు జరిగిన యోగా పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. విజయవాడకు చెందిన 9వ తరగతి విద్యార్థి ధీరజ్ శ్రీకృష్ణ శివ తాండవం, యోగాసన ప్రదర్శనను తిలకించిన ఎమ్మెల్యేతో పాటు సభికులు ఆ విద్యార్థిని అభినందించారు. ఈ ఏడాది సింగపూర్‌లో జరుగు అంతర్జాతీయ యోగా పోటీల్లో విద్యార్థి ధీరజ్ శ్రీకృష్ణ పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.



యోగా స్పోర్ట్స్ ముగింపు సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

వరద బాధితులకు దివీస్ రూ.15 కోట్లు సాయం



మంత్రి నారా లోకేష్‌కు రూ.5 కోట్లు చెక్కు అందిస్తున్న దివీస్ సంస్థ సిఇఒ డాక్టర్ కిరణ్ ఎస్ దివి

ప్రజాశక్తి -తగరపువలస : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వరద బాధితులకు ఇప్పటి వరకు రూ.15 కోట్లు సాయం అందజేసినట్లు దివీస్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మురళీ కే దివి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ రాష్ట్ర మానవవనరుల శాఖా మంత్రి నారా లోకేష్‌కు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చెరో రూ.5 కోట్లు చెక్కులను తమ సంస్థ సిఇఒ డాక్టర్ కిరణ్ ఎస్ దివి అందించారని తెలిపారు. పరిశ్రమలు, పౌరులు విరాళాల ద్వారా గానీ, స్వచ్ఛందంగా చేపట్టే ప్రజోపయోగ కార్యక్రమాల ద్వారా గానీ సహకరించాలన్న రెండు ప్రభుత్వాల ముఖ్య మంత్రుల పిలుపు మేరకు దివీస్ సంస్థ ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఇంతటి విపత్కర పరిస్థితుల్లో వరద బాధితులకు రెండు ప్రభుత్వాలు అండగా నిలబడి, ఎంతో సమర్థవంతంగా సేవలు అందించాయని పేర్కొన్నారు. అక్షయ పాత్ర ఫౌండేషన్ ద్వారా మరో రూ.5 కోట్లతో సుమారు 16 లక్షల మంది వరద బాధిత ప్రాంత ప్రజలకు 8 రోజుల పాటు తమ సంస్థ అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో అందరూ కలిసి ముంపు ప్రాంతాల ప్రజలను ఆదుకోవాలని సంస్థ ఎమ్‌డి డాక్టర్ మురళీ కె.దివి కోరారు.

ఘనంగా ఒమ్మి సన్యాసిరావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి – ఆరిలోవ : టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, విశాఖ జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు ఒమ్మి సన్యాసిరావు జన్మదిన వేడుకలు ఆదివారం ఆరిలోవ తోటగరువు, వెర్నిదుర్గమాంబ వద్ద గల కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు హాజరయ్యారు. ముందుగా ఎన్‌టిఆర్ ట్రస్టు ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం పుట్టిన రోజు కేక్‌ను కట్ చేసి సన్యాసిరావుకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. పలు వార్డుల నుంచి టిడిపి నాయకులు, యాదవ సంఘం నాయకులు, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వచ్చి సన్యాసిరావుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. పుట్టిన రోజును పురస్కరించుకొని సుమారు 200 మంది పేద మహిళలకు చీరలు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రాత పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఒమ్మి అప్పలరాజు, బుడుమూరు గోవిందు, పోలారావు, ఏడువాక సన్యాసిరావు, ముగడ రాజారావు, పొత్రకండ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.



ఒమ్మి సన్యాసిరావును సన్మానించిన ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి తదితరులు


శిల్పారామంలో అలరించిన నృత్య ప్రదర్శనలు



నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

ప్రజాశక్తి -మధురవాడ : శిల్పారామం వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సింహాచలం ప్రాంతానికి చెందిన సరస్వతి నృత్యకళా మందిర్ ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముందుగా మూషిక వాహన, ముద్దుగారే యశోద, బ్రహ్మ కడిగిన పాదము, శివపాన మంజీర నాదం, తందనాన, స్వాగతం, అరిఖిలాండేశ్వరి, బలిదవన మాలి గేయాలకు నిఖిత, భావన, పారణ్య, భవిష్య, కీర్తన, వేమినిక, సమంత, గీతిక, చిన్నారులు నృత్యాలు చేశారు. పరిపాలనాధికారి టి.విశ్వనాథ్‌రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

నటుడు కెఎస్.ప్రసాద్ మృతి



ప్రజాశక్తి - ఆరిలోవ : నగరానికి చెందిన సినీనటుడు కెఎస్.ప్రసాద్ అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. ఆంధ్రా యూనివర్సిటీలో అసిస్టెంట్ లైబ్రేరియన్‌గా ఉద్యోగ విరమణ చేసిన కెఎస్.ప్రసాద్ హనుమంతువాక క్రాంతినగర్‌లో తన కుటుంబంతో నివసిస్తున్నారు. ఆయనకు భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. నటన ఆయనకు ప్రవృత్తి. ప్రతిఘటన, కలియుగపాండవులు, వివాహ భోజనంబు, జంభలకిడిపంబ, సుస్వాగతం తదితర సుమారు 40 సినిమాలలో చిరు పాత్రల్లో నటించారు. లాహిరి లాహిరి, దేవత తదితర సీరియల్స్, రంగస్థలంపై నాటకాలు ప్రదర్శించారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.

హోమియో మందులు పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్నిగ్ధశ్రీ దేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన చిన్న బజారు వద్ద ఉన్న ఫౌండేషన్ కార్యాలయంలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. వైద్యులు టి.జగన్నాథరావు, టిజె.మోహన్ సుమారు వంద మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ఎన్ మూర్తి, కె.చంద్రశేఖర్, కెవి.భానోజీరావు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పూర్వ విద్యార్థినుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఏపి బాలికల గురుకుల పాఠశాలలో 1986 టెన్త్ బ్యాచ్ విద్యార్థినులు ఆదివారం వారు చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. చదువుకున్న నాటి జ్ఞాపకాలను, అనుభూతులను గుర్తుచేసుకున్నారు. చదువునేర్పిన అప్పటి ఉపాధ్యాయులను ఈ సందర్భంగా సత్కరించారు. జీవితంలో స్థిరపడినందుకు కృతజ్ఞతగా చదువుకున్న పాఠశాలకు వీరంతా రూ.లక్ష విలువైన నాలుగు ఇన్వర్టర్లు, రూ70 వేలు విలువైన కంప్యూటర్, ప్రింటర్‌ను ఇంఛార్జి ప్రిన్సిపల్ ప్రకాష్‌కు అందజేశారు. వీరిని ప్రిన్సిపాల్ అభినందించారు. పాఠశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలు నాటారు.

నేరాలు ఘోరాలు

గంజాయితో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్లో పాత నిందితుడ్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు దిశ ఎసిపి సిహెచ్.పెంటారావు తెలిపారు. పిఎం.పాలెం పోలీస్‌స్టేషన్లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. విజయనగరం జిల్లా మోడివలసకు చెందిన ఎర్నింటి కృష్ణబాబు ఇంటర్మీడియట్ చదివే రోజుల్లో చెడు వ్యసనాలకు బానిసై డబ్బులు కోసం దొంగతనాలకు పాల్పడ్డాడని తెలిపారు. అతనిపై భీమిలి పోలీస్ స్టేషన్లో 5, ఆనందపురం, పద్మనాభం, పిఎం.పాలెం, డెంకాడ, విజయనగరం పోలీస్ స్టేషన్లలో ఒకొక్క కేసు నమోదై ఉన్నాయని వివరించారు. ఈ సంవత్సరం మార్చి నెలలో భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ఇంటి దొంగతనం కేసులో జైలుకు వెళ్లి ఆగస్టులో విడుదలై బయటకు వచ్చినట్లు తెలిపారు. జైలులో పరిచయమైనకోనాడ రాంబాబుతో కలిసి ఆరిలోవ ప్రాంతంలో యమహా బైక్‌ను దొంగతనం చేశారని పేర్కొన్నారు. తరువాత ట్రెంచ్ మెరైన్ అపార్ట్‌మెంట్, రుషికొండలో నాలుగు మొబైల్ ఫోన్లు, విజయనగరం పరిధిలో ఒక హీరో బైక్, ఆనందపురం, ఎలక్ట్రికల్ ఆఫీస్ వద్ద ఒక పల్సర్ బైక్‌ను దొంగతనం చేశాడని, వాటిని వెంటనే అమ్మితే పోలీసులకు పట్టుబడతామని భావించి కొమ్మాది శివారు దేవి మెట్ల వద్ద ఒక పాడుబడిన రేకుల షెడ్డులో ఉంచాడని తెలిపారు. నిందితుడు స్నేహితుడు కోనాడ రాంబాబు ఇచ్చిన రెండు కిలోల గంజాయిని కూడా ఈ రేకుల షెడ్డులోనే దాచి ఉంచాడని చెప్పారు. వచ్చిన సమాచారం మేరకు రేకులషెడ్డుపై దాడిచేసి నిందితుణ్ని అరెస్టుచేశామని తెలిపారు. గంజాయి, దొంగిలించిన 4 సెల్ పోన్లు, ఒక పర్సనల్ సెల్ ఫోన్, మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని, నిందితుణ్ని కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు. కోర్టు అతనికి రిమాండ్ విధించినట్లు తెలిపారు. సిఐ జి.బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని శొంఠ్యాం పంచాయతీ మిందివానిపాలెం జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... భీమిలి మండలం, చిట్టివలస జీరిపేట గ్రామానికి చెందిన చిల్లా మాధవరెడ్డి (51) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో తగరపువలస నుంచి చేపల వ్యాపారులు రమ్య, గరగయమ్మలను ఎప్పటిలాగే ఆటోలో తీసుకొని లంకెలపాలెం వెళ్లి చెరువు చేపలు కొనుక్కొని తిరిగి వస్తున్నారు. శనివారం అర్ధరాత్రి మిందివానిపాలెం వద్ద ఆటో టైర్ పంచర్ కావడంతో రోడ్డు పక్కన ఆపిమాధవరెడ్డి టైర్ మార్చుతుండగా పెందుర్తి నుంచి ఆనందపురం వైపుగా వచ్చే సిమెంట్ లారీ (ఎపి16 టిజె 4131) ఆటోతో పాటు మాధవరెడ్డిని కొంత దూరం ఈడ్చుకుపోయింది. లారీ చక్రం కింద పడి మాధవరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న ఇద్దరు మహిళలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మాధవరెడ్డి సోదరుడు చిల్లా వెంకట్‌రెడ్డి ఫిర్యాదు మేరకు సిఐ చింత వాసునాయుడు ఆధ్వర్యాన ఎస్ఐ శివ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను హత్య చేసిన భర్త

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : భార్యను హత్య చేసి భర్త పరారైన సంఘటన ఎంవిపి.పోలీస్ స్టేషన్ పరిధిలోని నక్కవానిపాలెంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అల్లూరి సీతారామరాజు జిల్లా జికె.వీధి మండలం సీలేరు గ్రామానికి చెందిన చెల్లూరి సలోమి (28)కి నక్కవానిపాలెంలో నివాసముంటున్న డేనియల్‌తో 2017లో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కవల పిల్లలు. రెండు సంవత్సరాలుగా భార్యను అనుమానిస్తూ డేనియల్ వేధిస్తున్నాడు. వారి మధ్య కొద్దికాలంగా గొడవలు జరుగుతున్నాయి. కౌన్సిలింగ్ ఇచ్చినా మార్పు రాలేదు. ఈ క్రమంలోనే ఆదివారం తెల్లవారుజామున మెడ నులిమి సలోమిని అతడు హత్య చేశాడు. కేసును ఎఎస్ఐ మూర్తి దర్యాప్తు చేస్తున్నారు.

బోటీల కొనుగోళ్లపై అప్రమత్తం

ప్రజాశక్తి – ఆరిలోవ : నిల్వ ఉన్న తలకాయలు, బోటీల కొనుగోళ్లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జివిఎంసి వైద్యాధికారులు హెచ్చరించారు. హనుమంతవాక పాత మేక కబేళా నుంచి కొంత మంది వ్యాపారులు ఢిల్లీ, తదితర ప్రాంతాల నుంచి తెచ్చి నిల్వ ఉన్న మేక తలకాయలు, బోటీలు అమ్ముతున్నట్టు సమాచారం రావడంతో జివిఎంసి వైద్య సిబ్బంది, జనసేన నాయకులు అక్కడకు చేరుకున్నారు. నిల్వ ఉన్న తలకాయలు, బోటీలను అమ్ముతున్న వ్యాపారులను అడ్డుకొని వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఫినాయలు వేసి నాశనం చేశారు. ఇక నుంచి ఇక్కడ తలకాయలు, బోటీలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిల్వ ఉన్న ఇటువంటి వాటిని కొంటే అనారోగ్యం పాలవుతారని కొనుగోలుదారులను హెచ్చరించారు.



మాట్లాడుతున్న భాస్కరరావు

22న జిప్సా ఎన్నికలు

ప్రజాశక్తి -గాజువాక : చైతన్యనగర్‌లోని సూర్యతేజ్ స్కూల్లో ఈ నెల 22వ తేదీన గాజువాక ఇండస్ట్రియల్ ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ (జిప్సా) ఎన్నికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు పి.భాస్కరరావు తెలిపారు. జిప్సా ప్రతినిధుల సమావేశం ఆదివారం గాజువాకలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఎన్నికల జరగనున్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారులుగా పి.ప్రభాకర్, డి.రాఘవరాజు, ఎం.జగ్గారావు వ్యవహరిస్తారని చెప్పారు. కార్యవర్గ సభ్యునిగా కనీసం మూడేళ్ల అనుభవం ఉండి, సభ్యత్వ బకాయి లేని వారు ప్రెసిడెంట్, ప్రధాన కార్యదర్శి, ట్రెజరర్ పదవులకు పోటీ చేయుటకు అర్హులని తెలిపారు. కణితిరోడ్డులోని సిద్ధార్థ స్కూల్లో ఈ నెల 16, 17, 18 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. 20వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు నామినేషన్ ఉపసంహరించుకోవచ్చని చెప్పారు. 2023-24, 2024-25 విద్యా సంవత్సర కాలంలో సభ్యత్వం రుసుం బకాయి లేకుండా చెల్లించిన వారు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. సభ్యులందరూ ఈ నెల 20వ తేదీలోగా సభ్యత్వం రెన్యువల్ చేసుకోవాలని కోరారు. కొత్తగా గుర్తింపు పొందిన స్కూళ్లు రెండేళ్ల సభ్యత్వ రుసుం చెల్లించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిప్సా కార్యదర్శి గిరీష్ శ్రీనివాస్, ట్రెజరర్ డి.శ్రీనివాసరావు, సభ్యులు రమేష్‌నాయుడు, కుమార్, బాబూరావు, రాము, సత్యనారాయణ, వెంకటరావు, మురళీ, మౌళి పాల్గొన్నారు.

రైతు బజార్లకు సెలవులు కొనసాగించాలని వినతి

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిధిలోని సీతమ్మధార, నరసింహనగర్ రైతుబజార్లకు యథావిధిగా సెలవు కొనసాగించాలని స్థానిక ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సీతమ్మధార రైతు బజారుకు ప్రతీ మంగళవారం, నరసింహనగర్ రైతుబజార్‌కు ప్రతీ బుధవారం సెలవు ఉందని, ఇప్పుడు వాటిని రద్దుచేశారని తెలిపారు. మెజార్టీ రైతులు, డ్వాక్రా సంఘాలు, ఇతర వ్యాపారులు సెలవు కోరుకుంటున్నారని వివరించారు. రైతు బజార్లో పెరిగిన అద్దెలను తగ్గించాలని కోరారు. సెలవు కొనసాగించాలని కోరుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కు, మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌కు కూడా వినతి పత్రాలు అందజేస్తామని రైతులు తెలిపారు.

ముచ్చర్లలో డెంగీ, డయేరియా

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం ముచ్చర్ల గ్రామపంచాయతీలో డెంగీ, డయేరియాతో గ్రామస్తులు బెంబేలెత్తిపోతున్నారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ వాంతులు, విరేచనాలతో మంచానపడ్డారు. పంచాయతీలోని ఎస్‌సి కాలనీకి చెందిన గొంప తాతాలు (65) విశాఖ కెజిహెచ్‌లో వైద్యం తీసుకుంటున్నారు. అతనికి డెంగీ సోకినట్లు శనివారం డాక్టర్లు నిర్ధారించారు. ఆదివారం సాయంత్రానికి మరో 10 మంది వాంతులు, విరేచనాలతో గ్రామంలో బాధపడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. గ్రామానికి చెందిన పాండ్రంకి అప్పలనాయుడు, కొల్లి లీలాధర్, లంక రాములమ్మ తదితరులు ఐదు రోజులుగా ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి డెంగీ, డయేరియాకు కారణాలను తెలుసుకొని, నివారణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామానికి సరఫరా అవుతున్న మంచినీటి ట్యాంకుకు మూడు బోర్ల ద్వారా నీటిని పంపిస్తున్నారని, ఈ ట్యాంకులో క్లోరినేషన్ చేయకపోవడం వల్ల విరేచనాలు, వాంతులు ప్రభలే అవకాశముందని స్థానిక యువకులు అభిప్రాయపడుతున్నారు. ఆదివారం సాయంత్రం లంక యూత్ సేవా సంఘం సభ్యులు గ్రామంలో శానిటేషన్ చేశారు.

ఘనంగా ఇంజినీర్స్ డే



సిజిఎం విజయలలితకు అవార్డును అందిస్తున్న ఎపిఎస్ఇబి ఇంజినీర్లు

ప్రజాశక్తి-యంత్రాంగం

భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని ఆదివారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సీతమ్మధార: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్లు వి.విజయలలిత, బి.రామచంద్రప్రసాద్, డి.సుమన్‌కల్యాణి, టివిఎస్ఎన్.మూర్తి, బి.అశోక్ కుమార్, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజినీరింగ్ రంగంలో చేసిన సేవలను పలువురు వక్తలు కొనియాడారు. ఎపిఇపిడిసిఎల్ ఇంజినీర్లుగా ప్రతిభ చూపుతూ విశిష్ట సేవలందిస్తున్న ఇద్దరు సిజిఎంలకు ఇంజినీర్స్ డే సందర్భంగా ఎమినెంట్ ఇంజినీర్ అవార్డులను ఎపిఎస్ఇబి ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన వి.విజయలలిత, బి.రామచంద్రప్రసాద్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్ఇబి ఇంజినీర్స్ అసోసియేషన్ సెక్రటరీ ఎస్‌వి.హేమంత్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ పి.త్రినాథరావు, విశాఖ బ్రాంచ్ సెక్రటరీ సిహెచ్.కోటేశ్వరరావు, అసిస్టెంట్ ఇంజినీర్ల అసోసియేషన్ సెక్రటరీ ఎస్.రామమూర్తి, డిప్లమో ఇంజనీర్ల అసోసియేషన్ సెక్రటరీ జి.జోగినాయుడు, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విశ్వేశరయ్య విగ్రహానికి రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎయు చీఫ్ ఇంజినీర్ తిరుపతిరావు, ఎయు ప్రాంగణ కళాశాలల ప్రిన్సిపల్స్, పలువురు డీన్లు , డైరెక్టర్లు, ఆచార్యులు పాల్గొన్నారు .

ఆనందపురం : ఆనందపురం మండలం గిడిజాలలోని సాయి గణపతి పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలలో విశ్వేశ్వరయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంజినీర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎం.వేణుగోపాల్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్.మహేశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ అమరేంద్రకుమార్ విభాగాధిపతులు సత్యవతి, రాజేంద్ర, స్వరూప, అరుణ, సోమేశ్వరరావు, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.


ఎంవిపి.కాలనీ : నరవ వద్దగల విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇంజినీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి జివిఎంసి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోరుపిల్లి చిరంజీవి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య ఇంజినీర్‌గా దేశానికి చేసిన సేవలు ఎంతో గొప్పవన్నారు. నేటి తరం విద్యార్థులకు ఆయన జీవితం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జివి.ప్రతాప్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి యు.అరుణ్ కుమార్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

సబ్బవరం: మండలంలోని గాలి భీమవరం ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఆర్.నాగభూషణరావు ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విధ్యార్థుల నైపుణ్యాన్ని మెరుగుపరిచేలా విద్యార్థులకు టెక్నాలజీ మీద పోస్టర్, పిపిటి ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించి,విజేతలకు బహమతులను అందజేశారు. కార్యక్రమంలో డైరక్టర్ జి. సురేంద్రకుమార్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిరంజీవి

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు



ఆటల పోటీల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-పెందుర్తి : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలోని ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించారు. పెందుర్తి డివిజన్ స్థాయిలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను పెందుర్తిలోని ఎరేనా బ్యాడ్మింటన్ అకాడమీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. డివిజన్ స్థాయి పోటీలను యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్.నాగమణి ప్రారంభించారు. విశాఖ జిల్లా కార్యదర్శి చుక్క సత్యం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.అప్పారావు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల మానసిక ఉల్లాసానికి, ఆరోగ్యానికి క్రీడలు అవసరం అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల హక్కులు, రాయితీలు, విద్యారంగ సంక్షేమం కోసం ఎప్పుడూ పోరాటాలే కాకుండా ఉపాధ్యాయులను ఒత్తిడి నుంచి దూరం చేయడానికి సాంస్కృతిక, క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. యుటిఎఫ్ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన పురుషులకు, మహిళలకు వేర్వేరుగా నిర్వహిస్తున్న డివిజన్, జిల్లా స్థాయి ఆటల పోటీలలో ఉపాధ్యాయులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు రొంగలి ఉమాదేవి, జిల్లా కార్యదర్శులు ఉప్పాడ రాము, మహ్మద్‌రిజ్వాన్, విజయకుమారి, అనకాపల్లి జిల్లా కార్యదర్శి జిఎస్.ప్రకాష్, పెందుర్తి మండల అధ్యక్షులు అప్పలరాము, కార్యవర్గ సభ్యులు బిఎన్.రవి, మధు, అప్పారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -ఆనందపురం : రాష్ట్రస్థాయి కరాటే ఓపెన్ ఛాంపియన్ షిప్ పోటీలలో ఆనందపురం గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. తాటిచెట్లపాలెంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీలో ఆనందపురం గ్రామానికి చెందిన కుప్ప రేవంత్ కుమార్ (7) ఖాతా విభాగంలో గోల్డ్ మెడల్, కుమితి విభాగంలో బ్రాంజ్ మెడల్, ముడసల సిద్ధూ (9) ఖాతా విభాగంలో గోల్డ్ మెడల్, కుమితి విభాగంలో గోల్డ్ మెడల్, కుప్ప దేవిశ్రీ ప్రసాద్ (10) సిల్వర్ మెడల్, కక్కల్ నిఖిలేష్ (11) ఖాతా విభాగంలో గోల్డ్ మెడల్, కుమితిలో బ్రాంజ్ మెడల్, పుట్ట మితేష్(8) ఖాతా విభాగంలో సిల్వర్ మెడల్, కుమితి విభాగంలో బ్రాంజ్ మెడల్, జాన్వి(8) బాలికల విభాగంలో గోల్డ్ మెడల్, కుప్ప మనోజ్ కుమార్ (8) ఖాతా విభాగంలో సిల్వర్ మెడల్, శినగం వికాస్(6) ఖాతా విభాగంలో సిల్వర్ మెడల్, శినగం సంజయ్ (12) ఖాతా విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించారు. ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షాడో షాటోకాన్ కరాటే శిక్షణ కేంద్రంలో కోచ్ ముగడ వెంకటరమణ యాదవ్ ఆధ్వర్యాన జై జవాన్ ఫౌండేషన్ ప్రతినిధి కుప్ప రాజశేఖర్ ఆధ్వర్యాన పిల్లలు మంచి ప్రతిభ చూపించి పలు పథకాలు గెలిచినందుకు ఆనందపురం గ్రామ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



పతకాలు సాధించి తెచ్చిన చిన్నారులతో కోచ్ తదితరులు

10న బతుకమ్మ సంబరాలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉక్కునగరంలోని సీ భవన్‌లో అక్టోబర్ 10వ తేదీన బతుకమ్మ సంబరాలను నిర్వహించనున్నట్లు ఉక్కు తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం తెలిపింది. ఎన్.కుమారస్వామి అధ్యక్షతన ఆదివారం సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశానికి స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్, సంఘం చీఫ్ అడ్వైజర్ ఎన్.వీరేశం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, ఉక్కునగరంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఉక్కు ఉద్యోగ కుటుంబాలు ఏటా బతుకమ్మ సంబరాలను జరుపుకుంటున్నాయని తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శి జి.ఆనంద్ మాట్లాడుతూ, ఉక్కునగరంలో బతుకమ్మ వేడుకల్లో భాగంగా మహిళలు ఆట, పాటలతో అలరిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు బి.వెంకటేశ్వర్లు, ఎన్.నర్సింగరావు, జి.మల్లేశం, టి.ప్రభాకర్, ఎం.వేణుగోపాల్, సిహెచ్.రవికుమార్, జె.శ్రవణ్‌కుమార్, బి.గణేష్, బి.బాలాజీ, శక్రునాయక్, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉక్కునగరం యూత్ అండ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యాన కొల్లి అభిలాష్ జ్ఞాపకార్థం రక్తదాన శిబిరాన్ని సెక్టార్-5లోని అంబేద్కర్ కళా ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. రేజేటి కిరణ్ కుమార్ పర్యవేక్షణలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి తెలుగుదేశం రాష్ట్ర ఉపాధ్యక్షులు విల్లా రామమోహన్ కుమార్ అధ్యక్షత వహించారు. తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్తదాన ఆవశ్యకత గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ రక్తం దానం చేసి మరో ఇద్దరు ప్రాణాలు కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విందుల వెంకటరమణ, అడుసుమల్లి దీప్తి, అత్తోట రవికుమార్, కర్రి దసేంద్ర పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతికి సంతాపం



రాంబిల్లిలో నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి -రాంబిల్లి : రాంబిల్లిలో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి .చిత్రపటానికి ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేముడునాయుడు మాట్లాడుతూ ఏచూరి మరణం కార్మిక, కర్షక వర్గానికి తీరనిలోటన్నారు.నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం కంకణబద్ధుడై ఉండి, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, ఎంతోమంది అభిమాని ంచే నాయకుడిగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో అల్లూరి ప్రజా సంఘాల నాయకులు భూపతి అప్పారావు, వై శ్రీనివాసరావు, కె వి రమణ, వై రాము, వై సత్తిబాబు, సిహెచ్ రామకృష్ణ, చౌడిపల్లి గంగరాజు, ధనరాజు, గణేష్, నూకరాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మధురవాడ : ప్రజల కోసమే జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి అని సిపిఎం మధురవాడ జోన్ కార్యదర్శి డి.అప్పలరాజు అన్నారు. ఆదివారం కొమ్మాది కె-2 కాలనీలో సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి సిపిఎం సీనియర్ నాయకుడు సియ్యాద్రి పైడితల్లి, కాలనీ వాసులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు డి.కొండమ్మ, బి.భారతి, కె.పద్మ, చంద్రకళ, రాజు తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : జివిఎంసి 70 వార్డు పరిధి దశమకొండలో సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో పి.నర్సింగ రావు, సంతోషం, సత్యవతి, పి.శేషరత్నం, జ్యోతి, కోటేశ్వరరావు, మంగ, రాజు దాలినాయుడు పాల్గొన్నారు.

గొలుగొండ: కమ్యూనిస్టు మేధావి కామ్రేడ్ సీతారం ఏచూరి మృతికి మండలంలోని సుద్దలపాలెం గ్రామంలో సంతాపం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి సీనియర్ నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలనంతరం ఆయన మాట్లాడుతూ ఏచూరి కమ్యూనిస్టు ఉద్యమంలో చెరగని ముద్ర వేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు అడిగర్ల రాజు, పి.కళ్యాణ్, టి.మహలక్ష్మి, సెగ్గే సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



గాజువాక దశమకొండలో నివాళులర్పిస్తున్న నాయకులు



నివాళులర్పిస్తున్న మధురవాడ సిఐటియు నాయకులు



సుద్దలపాలెంలో నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న పదో అదనపు జిల్లా జడ్జి శ్రీవిద్య

ప్రజాశక్తి-అనకాపల్లి : రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పదో అదనపు జిల్లా జడ్జి శ్రీవిద్య కోరారు. కోర్టుల చుట్టూ తిరిగే పని ఉండదని సూచించారు. అనకాపల్లి కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులకు పలు సూచనలు చేశారు. అనవసరమైన గొడవలు పెంచుకొని బంధుత్వాలు పోగొట్టుకోవద్దన్నారు. కోర్టుల చుట్టూ తిరిగితే ఆర్థికంగా ఇబ్బందులు పడతారన్నారు. లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకుని కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రెండో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ విజయలక్ష్మి, అధ్యక్షులు ఎంజెవిఎన్ కుమార్, సెక్రెటరీ దుర్గారావు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఒక ఫ్యామిలి కేసులో మైంటెనన్స్ కింద రూ.3 లక్షలు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ ఇప్పించారు. దీనికి కక్షిదారులు సంతోషం వ్యక్తపరిచారు.

వరద బాధితులకు నిత్యావసరాలు



బాధితులకు పంపిణీకి ప్యాకింగ్ చేసిన నిత్యావసరాలు

ప్రజాశక్తి - కశింకోట : విజయవాడ వరద బాధితుల సహాయార్థం కశింకోట హౌసింగ్ కాలనీ ముత్యాలమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో నిత్యావసరాలను ఆదివారం పంపిణీ చేశారు. విజయవాడలోని 80 బాధిత కుటుంబాలకు 20 కేజీల బియ్యం, ఒక కేజీ గోధుమపిండి, ఒక కేజీ కందిపప్పు అరికిలో సేమియా,రూ.20 బిస్కెట్ ప్యాకెట్‌ను కలిపి, అన్నీ ఒక ప్యాకింగ్‌గా సిద్ధం చేసి, వ్యాన్‌లో తరలించి, విజయవాడలోని బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో నూకాలమ్మ, శిష్టి రాజు, సంతోష్, రంజిత్ , శ్రీనివాస్ మరికొందరు సమితి సభ్యులు పాల్గొన్నారు

17న నులిపురుగుల నివారణ దినోత్సవం



డిఎంహెచ్ఒ డాక్టర్ బాలాజీ

ప్రజాశక్తి -అనకాపల్లి : ఈనెల 17న రాష్ట్ర వ్యాప్తంగా జరుగు జాతీయ నులిపురుగుల దినోత్సవంలో ఒకటి నుంచి 19ఏళ్ల బాల బాలికలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలాజీ తెలిపారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలతో జిల్లాలో ఉన్న అన్ని అంగన్వాడి, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కళాశాలలో, పాఠశాలకు వెళ్లని బాలబాలికలు కౌమార బాల బాలికలకు ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా అందిస్తామన్నారు. ఒకటి రెండు సంవత్సరాల పిల్లలు సగం మాత్ర, మూడు నుంచి 19ఏళ్ల పిల్లలు ఒక మాత్రను పూర్తిగా చప్పరించి వేసుకోవాలన్నారు. జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందన్నారు.17న మాత్రలు వేసుకోనివారికి ఈనెల 25న మ్యాప్ ఆఫ్ రౌండ్ కార్యక్రమంలో తప్పక వేసుకోవాలన్నారు. ఐసిడిఎస్, విద్యాశాఖ,, ఇతర శాఖల అధికారులు సహకారంతో జరిగే ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నాగభూషణంకు జాతీయ సేవా పురస్కారం

ప్రజాశక్తి -అనకాపల్లి : సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బల్లా నాగభూషణానికి జాతీయ సేవా పురస్కారం లభించింది. విజయవాడ బాలోత్సవ భవన్‌లో కాళోజీ స్మారక సంస్థ, తెలుగు వెలుగు సాహితీ సంస్థల సంయుక్త అధ్వర్యంలో ఆదివారం జాతీయ స్థాయిలో వివిధ రంగాలలో విశేష సేవలను అందించిన వారికి తెలుగు వెలుగునంది జాతీయ సేవా పురస్కారాలను అందజేశారు. ఇందులో భాగంగా నాసా పూర్వ శాస్త్రవేత్త చందు సాంబశివరావు నుంచి బల్లా నాగభూషణం ప్రశంసా పత్రం, మెమొంటో, నంది విగ్రహం తెలుగు వెలుగు నంది జాతీయ సామాజిక సేవా పురస్కారం 2024 కింద స్వీకరించారు. ఈసందర్భంగా నాగభూషణంను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా సిద్ధార్థ సంస్థ ద్వారా బల్లా నాగభూషణం చేస్తున్న సేవలను కొనియాడారు. అవార్డు గ్రహీత బల్లా మాట్లాడుతూ, ఈ అవార్డు తనబాధ్యతను మరింత పెంచిందన్నారు. నాగభూషణంను పట్టణంలోని వివిధ సామాజిక, సాహితీ, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు హర్షాన్ని వ్యక్తం చేసారు.

జాతీయ తెలుగు వెలుగు నంది పురస్కారాల వేడుకలో పౌర సంబంధాల సమాచార శాఖ అధికారి టి.మోహనరాజు, జిల్లా గ్రామ సచివాలయ జాయింట్ కమిషనరు మొగిలి చండు సురేష్, గుర్రం జాషువా మనుమరాలు జాషువా సాహితీ సంస్థ అధ్యక్షులు ఎ.రేవతి, తెలుగు వెలుగు సాహితీ వేదిక సంస్థ అధ్యక్షులు పోలోజు రాజ్ కుమార్, కాళోజీ స్మారక సంస్థ ప్రతినిధి వేములవాడ రాధిక పలువురు అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.



నాగభూషణంను అవార్డుతో సత్కరిస్తున్న నిర్వాహకులు

జాతీయ యోగా పోటీలకు 'శ్రీకృష్ణ' విద్యార్థులు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈనెల 14, 15 తేదీల్లో భీమిలి సన్ స్కూల్‌లో యోగ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో విశాఖ యోగ స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన 49వ రాష్ట్రస్థాయి యోగా పోటీలలో తుమ్మపాల శ్రీకృష్ణ యోగా సెంటర్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. 45 ఏళ్ల పైబడిన విభాగంలో బుదిరెడ్డి నర్సింగరావు ద్వితీయ బహుమతి, 40 ఏళ్ల పైబడిన మహిళ విభాగంలో బుదిరెడ్డి నాగమణి ద్వితీయ బహుమతి సాధించారు. అలాగే 12 సంవత్సరాల విభాగంలో జి ప్రసన్న హేమ నాలుగవ బహుమతి, ఎన్ హేమ వెంకట్ ఆరవ బహుమతి గెలుపొందారు. వీరంతా హిమాచల్ ప్రదేశ్‌లో జరిగే జాతీయ యోగా పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. వీరిని గ్రామ పెద్దలు, తుమ్మపాల గ్రామ మాజీ సర్పంచ్ కర్రి వెంకట సన్యాసినాయుడు(బాబి) ఎస్‌విడిఎస్ కార్యదర్శి కర్రి జోగినాయుడు, మార్టూరు అజయ్, నడిపల్లి గణేష్, పల్లెల గణేష్, ఎంపిటిసి సభ్యులు పన్నీరు వెంకటలక్ష్మి చంటి, వాకర్స్ క్లబ్ అధ్యక్షులు ఎరుబండి సత్యనారాయణ, పలువురు యువజన సంఘం నాయకులు అభినందించారు.



జాతీయ పోటీలకు ఎంపికైన యోగా క్రీడాకారులు

వరద బాధితులకు సిపిఎం విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి- సబ్బవరం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో నిధుల సేకరణ చేపట్టారు. సిపిఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, దుకాణాల వద్దకు వెళ్లి నిధులు సేకరించారు. ఈ సందర్భంగా రూ.. 6,920 విరాళాలను సేకరించామని, వాటిని పార్టీ రాష్ట్ర కమిటీకి పంపి, విజయవాడలోని బాధితులకు అందజేసే చర్యలు చేపట్టనున్నట్లు సత్యవతి తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు పప్పుల కోటేశ్వరరావు, మొల్లేటి గౌరేశ్వరరావు, కె.కోటేశ్వరరావు, పిల్లల వరలక్ష్మి పాల్గొన్నారు.

వికలాంగులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న సన్యాసిరావు కుటుంబీకులు

ప్రజాశక్తి- అచ్యుతాపురం : పూర్వ విలేకరి ధర్మిరెడ్డి సన్యాసిరావు 11వ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం వారి కుటుంబీకులు స్థానిక వికలాంగుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఆశ్రమ పాఠశాలలో వికలాంగ విద్యార్థులకు మధ్యాహ్న భోజన ఏర్పాటు చేశారు. జాతీయ అవార్డు గ్రహీత పిఎస్‌టి పట్నాయక్, ఎంపిటిసి సభ్యుడు లాలం శ్రీనివాసు వైసిపి నాయకులు డి నాయుడుబాబు, ధర్మిరెడ్డి అప్పలనాయుడు ,హరిపాలెం హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు రాజు, కీర్తి సురేష్ లక్ష్మి రాము లక్ష్మణ్ రవి వంశీ జస్విన్ పాల్గొన్నారు.

భారీ వాహనాలతో రహదారి ఛిద్రం!

- కెవి.రోడ్డు అధ్వాన స్థితితో రాకపోకలకు ఇక్కట్లు
- తారురోడ్డు పైపొర లేచిపోవడంతో అవస్థలు



పైపొర పొడవ్వడంతో అధ్వానంగా మారిన కెవి.రోడ్డు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : భారీ వాహనాల రాకపోకలతో మండలంలోని బంగారుమెట్ట నుండి కశింకోట జంక్షన్ వరకు కెవి.రోడ్డులో తారు రోడ్డు అధ్వానస్థితికి చేరుకుంటోందని ప్రజలు, వాహనదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఏడాది క్రితం కసింకోట నుండి బంగారు మెట్టు జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ పనులను ప్రభుత్వం చేపట్టింది. దీంతో 12 అడుగుల గల రోడ్డును 24 అడుగుల మేర రోడ్డును విస్తరించారు. కశింకోట జంక్షన్ నుండి రాజాం జంక్షన్ వరకు రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు. రాజాం జంక్షన్ నుండి బంగారుమెట్ట జంక్షన్ వరకు పాత రోడ్డుకు ఇరువైపులా మాత్రమే విస్తరణ చేశారు. మధ్యలో ఉన్న రోడ్డుకు ఆరేళ్ల క్రితం తారు రోడ్డు వేశారు. కొద్దిరోజులుగా చోడవరం వైపు వెళ్లే రోడ్డు, వంతెనలు మరమ్మతులకు గురి కావడంతో పాడేరు, మాడుగుల, నర్సీపట్నం ప్రాంతాల నుండి అనకాపల్లి, విశాఖపట్నం వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గం ద్వారానే అధికసంఖ్యలో ద్విచక్ర వాహనదారులు, జీపులు కార్లు ఇతర వాహనదారులు ప్రయాణాలు సాగిస్తున్నారు. అలాగే పలు ప్రాంతాలకు వెళ్లే స్టోన్ క్రషర్ల నుండి రవాణా చేసే లారీలు, గ్రానైట్ లారీలు భారీ వాహనాలు 30- 40 టన్నుల వరకు రవాణా చేస్తుండడంతో దిబ్బి డి, బుచ్చయ్యపేట తదితర గ్రామాల వద్ద రోడ్డు పెచ్చులు ఊడి పోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని, రోడ్డు పాడవ్వడానికి కారణమైన భారీ వాహనాల రాకపోకలపై నియంత్రణ విధించటంతోపాటు పాడైన రోడ్డును పటిష్టపరిచే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రాంకీ యాజమాన్యంపై చర్యల్లో నిర్లక్ష్యం

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి



కాలుష్యమయమైన మొల్లోడు గెడ్డను చూపుతున్న గనిశెట్టి

ప్రజాశక్తి - పరవాడ: రాంకీ ఫార్మా విడుదల చేస్తున్న రసాయన వ్యర్థాలతో మండలంలో పరవాడ, భరిణికం మధ్య ఉన్న మొల్లోడు గెడ్డ విషపూరితంగా మారుతోందనిని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మండిపడ్డారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోన్న రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివారం గెడ్డ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ రాంకీ వ్యర్థాలతో మొల్లోడు గెడ్డ కాలుష్యకారకంగా మారిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు తగు చర్యలు చేపట్టాలని ఆదేశించినా, రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదని మండిపడ్డారు.. జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో నాలుగు రోజులపాటు వ్యర్థరసాయనాలను ట్యాంకర్ ద్వారా తరలించి రాంకీ యాజమాన్యం చేతులు దులుపుకుందని గనిశెట్టి మండిపడ్డారు. ఇప్పటికే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేశామన్నారు. వెంటనే వ్యర్థ జలాలు తరలించకపోతే ప్రజా ఆగ్రహానికి రాంకీ యాజమాన్యం గురికాక తప్పదని గనిశెట్టి హెచ్చరించారు.

మోటారు కార్మికుల జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- అనకాపల్లి : కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నూతన మోటార్ చట్టం -2023 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24, 25 తేదీల్లో బెంగుళూరులో జరిగే అఖిల భారత మోటార్ వర్కర్స్ 18వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఎపి ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి వామనమూర్తి మోటార్ కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని మూలపేట గ్రామంలో సమావేశంలో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా డీజిల్, పెట్రోల్ ధరలు ఒకే విధంగా అమలు చేయాలని కోరారు. జాతీయ రహదారులపై పెట్టిన టోల్ గేట్లు ఫీజులను నియంత్రించాలని, భారీగా పెంచిన ఇన్సూరెన్స్, రోడ్ టాక్స్, మోటార్ వాహన విడిభాగాల ధరను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ప్రమాదకరంగా ఉన్న రోడ్ల పక్కగా వేసి వాహనదారులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ అధికారంలో వస్తే వంద రోజులు డీజిల్, పెట్రోలు నిత్యావసర వస్తువులు ధరలు తగిస్తామని, సంవత్సరానికి రెండు కోట్ల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలను పుష్కరం దాటినా అమలు చేయలేదని మండిపడ్డారు. ప్రధాని మోడీ ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో సంఘం నాయకులు కష్ట పల్లా నర్సింగరావు, సూరి అప్పారావు, సిహెచ్ రాము, బి.సత్తిబాబు, సుబ్బరాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవా మందిరం ప్రారంభం

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట కోమటి వీధిలో నూతనంగా నిర్మించిన సత్య సాయి సేవ, ప్రార్థన మందిరాన్ని సంస్థల రాష్ట్ర అధ్యక్షులు ఆర్ లక్ష్మణరావు, టిడిపి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్ ఆదివారం ప్రారంభించారు.

దాడికి పాల్పడుతున్న కోతి పట్టివేత

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో ప్రజలను భయాందోళనకు గురిచేసిన కోతిని ఎట్టకేలకు బంధించారు 15 రోజులుగా దొండా వారి పాత మేడ వద్ద తిష్ట వేసి 15 మందిని గాయపరిచింది. కోతి దాడిలో పరిగెత్తలేని చిన్నారులు, వద్దులే ఎక్కువగా గాయపడ్డారు.కోతికి భయపడి ఇంట్లో నుంచి బయటికి రావడానికి స్థానికులు భయపడేవారు. ఈ నేపథ్యంలో పంచాయతీ ఇఒ లవరాజు స్పందించి కోతులను పట్టుకునే అగ్గిరాముడు బృందాన్ని రప్పించి కోతిని బంధించి అడవిలో విడిచారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు

చాత్రోపాధ్యాయుల అపూర్వ కలయిక



కలుసుకున్న చాత్రోపాధ్యాయులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో 1984 -85లో ఉపాధ్యాయ శిక్షణ పొందిన చాత్రోపాధ్యాయులు ఆదివారం శిక్షణ పొందిన సంస్థలో ఒకే చోట కలుసుకున్నారు. శిక్షణ పొందిన కాలంలో నాటి జ్ఞాపకాలను, అనుభూతులను గుర్తుచేసుకున్నారు. ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు విశాఖ, నర్సీపట్నం, పాడేరు, అనకాపల్లి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి చాత్రోపాధ్యాయులు హాజరై ఒకరినొకరు పలకరించుకున్నారు. పిల్లలు, ఆరోగ్యాలపై ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. అప్పట్లో 175 మంది ఉపాధ్యాయ శిక్షణ పొందగా 120 మంది ఈ ఆత్మీయ సమావేశానికి హాజరయ్యారు. హాజరైన వారిలో 40 మంది ఉద్యోగ విరమణ పొందిన వారు ఉన్నారు. వీరిని నిర్వాహక కమిటీ ఆధ్వర్యాన సత్కరించారు. వీరందరికీ భీమిలి, తగరపువలసలో ఉన్న చాత్రోపాధ్యాయులు స్థానిక డైట్ వేదికగా ఆతిథ్యమిచ్చారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఎపిసి బి.శ్రీనివాసరావు, డైట్ ఇన్చార్జి ప్రిన్సిపల్ యు.మాణిక్యంనాయుడు, విశ్రాంత డైట్ ప్రిన్సిపల్ ఎ.సాయిబాబు, విశ్రాంత అధ్యాపకులు ఎంవి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. నిర్వాహక కమిటీ ప్రతినిధులు పి.రాజేంద్రప్రసాద్ వర్మ, ఎస్.కృష్ణారావు, లివింగ్‌స్టన్, అప్పారావు తదితరుల సారథ్యంలో కార్యక్రమం నిర్వహించారు.

పుస్తకావిష్కరణ..

తీయని గతం పేరిట గత స్మృతులను నెమరవేస్తూ రచయిత, ఉపాధ్యాయులు పి.రాజేంద్రప్రసాద్‌వర్మ రచించిన పుస్తకాన్ని సభలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వర్మను పలువురు అభినందించారు.

పట్టణ బాలకృష్ణ, ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణ బాలకృష్ణ, ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ నూతన కార్యవర్గం ఎన్నికలు ఆదివారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో సంఘ గౌరవ అధ్యక్షులు పొలిమేర నాయుడు అధ్యక్షతన జరిగాయి. స్నేహపూర్వకంగా జరిగిన ఎన్నికల్లో పట్టణ బాలకృష్ణ ఫాన్స్ నూతన అధ్యక్షులుగా మళ్ల సంతోష్, ఉపాధ్యక్షులు కాంగ్రేగుల సతీష్, ప్రధాన కార్యదర్శిగా విల్లూరి అప్పలనాయుడు, సంయుక్త కార్యదర్శి మొల్లి రమణ, కోశాధికారిగా దూలం ప్రసాద్ లను ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులకు గౌరవ అధ్యక్షులు పొలిమేర నాయుడు సంఘ విధివిధానాలను వివరించారు. ఎన్నికైన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. బాలకృష్ణ సినీ రంగ ప్రవేశం జరిగి 50ఏళ్ళు పూర్తయిన సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహిస్తామని నాయుడు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ఫ్యాన్స్ పెతకంశెట్టి శ్రీనివాసరావు, మళ్ల గణేష్, బోడి వెంకటరావు, కరణం శ్రీనివాసరావు, వేగి వెంకటరావు, మొల్లి రమణ, గొంప మహేష్, బుద్ధ భీమేష్, బొడ్డేడ అయ్యప్ప, బుద్ధ లక్ష్మీ అప్పారావు పాల్గొన్నారు.

సింగర్ దుర్గాప్రసాద్ పండాకు జాతీయ నంది అవార్డు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాలాక్షినగర్‌లో నివాసముంటున్న సింగర్ దుర్గా ప్రసాద్ పండా జాతీయ నంది అవార్డు అందుకున్నారు. కళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్, తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సంస్థ సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యాన విజయవాడలో శనివారం బాలోత్సవ్ భవన్‌లో తెలుగు వెలుగు సంస్థ 40 మంది కళాకారులకు నంది అవార్డులను అందజేసింది. సింగర్ దుర్గాప్రసాద్ పండాను సినీ, డివోషనల్, జానపద గాయకునిగా గుర్తించి అవార్డును అందజేశారు.

23లోగా ఇ-క్రాప్, ఇకెవైసి చేయించాలి



ముంపునకు గురైన వరిపొలాన్ని పరిశీలిస్తున్న ఎడిఎ రామారావు

ప్రజాశక్తి- సబ్బవరం : రైతులు సాగు చేస్తున్న ప్రతి పంటనూ ఇక్రాప్‌లో నమోదు చేయాలని అనకాపల్లి వ్యవసాయ సబ్‌డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.రామారావు గ్రామ వ్యవసాయ సహాయకులకు ఆదేశించారు. ఆదివారం మండలంలోనిసబ్బవరం, తవ్వవారిపాలెం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో సందర్శించి వర్షాలతో వరి పంట నష్టాన్ని పరిశీలించారు. రైతులకు పలు సూచనలు అందించారు. అనంతరం బోదువలస, మల్లు నాయుడు పాలెం గ్రామాలలో ఇ-క్రాప్ చేసుకున్న రైతులకు ఇకెవైసి జరుగుతున్న తీరును పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఈనెల 23 తో ఇక్రాప్ నమోదు, ఇకెవైసి పూర్తి చేయాలని , ఈనెల 25 నుంచి 27 వరకు ఇక్రాప్ జాబితాలను గ్రామసభల్లో చదివి వినిపిస్తామన్నారు. సామాజిక తనిఖీలకు జాబితాలను ప్రదర్శించి, పూర్తిస్థాయి ఫైనల్ జాబితాలను ఈనెల 30న అన్ని రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించాలని ఆదేశించారు. ఇక్రాప్‌లో నమోదైన రైతుల జాబితాతో పాటు పంట నష్టం వివరాలను గ్రామ సచివాలయం, రైతు సేవ కేంద్రాల్లో సామాజిక తనిఖీ కొరకు ప్రదర్శన చేయాలని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే మార్పులు చేసి జాబితాలను పంపించాలని కోరారు కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, గ్రామ వ్యవసాయ ఉద్యాన సహాయకులు బొబ్బరి లావణ్య , శ్రీనివాస్ మరియు పి .హేమలత మరియు పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆవఖండాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి ఆవఖండాన్ని పరిరక్షించి, తద్వారా అనకాపల్లి ముంపు నుంచి రక్షించాలని ఆవకండం పరిరక్షణ సమితి సభ్యులు కోరారు. ఆదివారం స్థానిక కొడుగంటి గోవిందరావు భవనంలో కన్వీనర్ దూలం బుసిరాజు అధ్యక్షతన అనకాపల్లి ఆవఖండం పరిరక్షణ సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, గతంలో ఆర్వావ్ ఎడిఫైసెస్ ప్రైవేట్ లిమిటెడ్, దాని బినామీ కంపెనీలు జరిపిన దురాక్రమణలు, అధికారులను లోబరుచుకుని నిషేధిత జాబితాలో ఉన్న ప్రాంతంలో వరద నీటి ప్రవాహాన్ని అడ్డుకునేటట్లుగా కట్టడాలు కట్టడం వల్ల ప్రస్తుతం ముంపు ప్రమాదం పొంచి ఉందన్నారు. ఆయా ప్రాంతాల్లో లేఅవుట్లకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని పోరాటాలు చేసామని గుర్తు చేసుకున్నారు. ఆవఖండంలో ఆవ గర్భంలోనికి వరద నీరు ప్రవహించే దారికి అడ్డుగా ఎటువంటి నిర్మాణాలు జరిపినా, ఆ ప్రాంతాన్ని ఏమాత్రం ఎత్తు చేసినా అనకాపల్లి పట్టణంతో పాటుగా, తుమ్మపాల, శంకరం ఆపై గ్రామాలన్నీ ముంపునకు గురయ్యే పరిస్థితులు ఉన్నాయని, ఫలితంగా ఆస్తి, ప్రాణనష్టాలు జరుగుతాయన్నారు.

ఆవఖండంలో ఎటువంటి నిర్మాణాలను జరప కూడదని, అటువంటి నిర్మాణాలకు అనుమతులను మంజూరు చేయకూడదని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కొన్ని అనధికార లేఔట్లు వెలుస్తున్న నేపథ్యంలో వాటి అనుమతులు రద్దు చేసే వరకు పోరాటం చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు వై ఎన్ భద్రం, ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్ బాబు, గాడి బాలు, సిపిఐ నాయకులు రాజాన దొరబాబు, న్యాయవాది శేఖరమంత్రుల సాయి పాల్గొన్నారు.

గుడిలోనే బడి..!

-శిథిలావస్థలో పాఠశాల
-అవస్థలు పడుతున్న విద్యార్థులు
-పట్టించుకోని అధికారులు



గుడిలో చదువుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలోని రామచంద్రపురం శివారు గిరిజన గ్రామమైన అలుముయ్యపాలెం గ్రామంలో పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో పాఠశాలను గుడిలో నిర్వహిస్తున్నారు. శిథిలావస్థకు చేరుకొని దాదాపు నాలుగు సంవత్సరాలు కావస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోలేదని, దీంతో బడిని గుడిలో నిర్వహిస్తున్నట్లు గ్రామానికి చెందిన పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అల్లుముయ్య పాలెం పాఠశాలను గెడ్డకు అవతల వైపు నిర్మించేవారు. అక్కడ కూడా రెండేళ్ల పాటు సమీపంలో గల ఆంజనేయస్వామి గుడి చెట్టు కింద నిర్వహించేవారు.ప్రస్తుతం వర్షాకాలం కావడంతో గెడ్డకు అవతలకి వెళ్లేందుకు, వచ్చేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో గెడ్డకు ఇవతల వైపును రామమందిరంలో పాఠశాలను నిర్వహిస్తున్నారు. గతంలో 18 మంది వరకు విద్యార్థులు చదువుకునే వారు. పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో ఏ క్షణాన ఏ ప్రమాదం ముంచుకు వస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు మండల కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలలో చేర్పించారు.

గిరిజన గ్రామానికి గత ప్రభుత్వం 3.30 కోట్లతో రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారని, అది కూడా అసంపూర్తిగా మిగిలి పోవడంతో గెడ్డలో వంతెన నిర్మాణం చేపట్టకుండా వదిలివేయడంతో గ్రామస్తులు విద్యార్థులు గెడ్డ అవతలకి వెళ్లేందుకు వచ్చేందుకు గిరిజనులు కొండకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న పాఠశాల

15 సంవత్సరాల క్రితం ఇక్కడ గెడ్డలో నిర్మించిన కల్వర్టు గెడ్డ ఉధృతికి ధ్వంసం అయ్యిందని కొంతవరకు రోడ్డు వేయించి వదిలేసారని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. ఏది ఏమైనప్పటికీ గ్రామంలో పాఠశాల నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి

పాఠశాల భవనం లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో దిక్కు తోచని స్థితిలో గుడిలో బడి నిర్వహిస్తున్నాం.



ఎం.భవాని,
విద్యా కమిటీ చైర్మన్

పాఠశాల భవనం నిర్మించాలి

పాఠశాల భవనం లేకపోవడంతో విద్యార్థులు ప్రైవేటు పాఠశాలకు వెళ్లి చదువుకుంటున్నారు. దీంతో ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుంది. అంతేకాకుండా విద్యార్థులు ఇంటికి చేరే వరకు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల భవనం నిర్మాణం చేపట్టాలి...



దల్లిరాజు, గ్రామ పెద్ద



నినాదాలు చేస్తున్న కార్మికులు

వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: జిల్లాలో వైద్య విభాగంలో పని చేస్తున్న ఒప్పంద కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలని, కార్మికులపై వేధింపులు ఆపాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షులు ఎల్వి రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నర్సీపట్నం ఏ రియా వైద్య విభాగ ఒప్పంద కార్మికుల సంఘం ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ, కార్మికులకు గుత్తేదారులు సకాలంలో జీతాలు ఇవ్వలేదన్నారు. వేతనాలు అడిగితే... బిల్లులు రాలేదని చెబుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి గుత్తేదారు వ్యవస్థను రద్దు చేయాలని, ఆప్కాస్లో కలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సత్యవతి, సోమేశ్వరరావు, పార్వతి, దుర్గా, లక్ష్మి, రాము, పద్మ, మల్లేశ్వరి, కమల, వర లక్ష్మి,లావణ్య, దేవి పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బైక్ యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఈ నెల 16 పాయకరావుపేట నుండి అచ్చుతాపురం వరకు చేపట్టే సిపిఎం బైకు యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు కోరారు. ఆదివారం సిపిఎం బైక్ యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, పార్మా, సేజ్‌లలో పని చేస్తున్న కార్మికులకు భద్రత కల్పించాలన్నారు. ప్రమాదాలను అరికట్టాలని, సేఫ్టీ ఆడిట్‌లు నిర్వహించాలన్నారు. కార్మిక శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కంపెనీల యాజమాన్యాలు ప్రమాణాలు పాటించక పోయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో సొంబ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వర్షపు నీటితో రహదారి జలమయం

అవస్థలు పడుతున్న రైతులు, మత్స్యకారులు

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని అమలాపురం నుండి సముద్ర తీర ప్రాంతానికి వెళ్లే గ్రావెల్ రోడ్డు వర్షాలు వచ్చినప్పుడు ఉప్పుటేరు నీటికి ముంపునకు గురవుతుంది. దీంతో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు, మూలపర్ర గ్రామానికి చెందిన రైతులు ఆ రోడ్డు గుండా రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అమలాపురం నుండి మత్స్యకారులు చీకటి సమయంలో చేపలు వేటకు వెళుతుంటారు. రోడ్డు ముంపునకు గురి కావడంతో ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా మూలపర్ర గ్రామానికి చెందిన పలువురు రైతులు పొలాల్లోకి వెళ్లే మార్గం కూడా ఇదే కావడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. సముద్ర తీర ప్రాంతంలో ఉన్న చేతి బోరు వాటర్‌తో ఆయా గ్రామాల ప్రజలు దాహార్తిని తీర్చుకుంటారు. సైకిల్, బైక్ వెళ్లి వాటర్‌ను తెచ్చు కుంటారు. వర్షాలు వచ్చినప్పుడు ఉప్పుటేరులో వరద నీరు కలవడంతో రోడ్డు ముంపునకు గురికావడంతో ప్రజలు తాగునీరు తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు.ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయందోళన చెందుతున్నారు. ఈ మేరకు గ్రామ సర్పంచ్ పెదపూడి శంకర్రావు, నాయకులు ఏరిపిల్లి సత్తిబాబు, రాకాతి రాజు మాట్లాడుతూ, వర్షం వచ్చినప్పుడల్లా రోడ్డు ముంపునకు గురవుతుందని, దీంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి ముంపునకు గురికాకుండా రోడ్డు నిర్మాణం చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.



నీటిలోనే వెళుతున్న ద్విచక్ర వాహనదారుడు



ఎస్ఐని అభినందిస్తున్న నాయకులు

ఎస్ఐని కలిసిన వైసిపి నేతలు

ప్రజాశక్తి-గొలుగొండ:కృష్ణదేవి పేట ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన దివ్యను ఆదివారం పలువురు వైసీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఏఎల్ పురం సర్పంచ్, వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు లోచల సుజాత, ఎంపిటిసి సభ్యులు చింతల బుల్లిప్రసాద్, మామిడి కృష్ణ, మెంబర్ సుర్ల అవినాస్ నాయుడు కలిశారు. సిహెచ్.నాగాపురం సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు తదితర వైసీపీ నాయకులు కూడా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపమాకలో ఘనంగా గణపతి లడ్డు వేలం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాకలో మెరక వీధి రామాలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం లడ్డు వేలంపాట ఎంతో ఉత్సాహంగా జరిగింది. గ్రామానికి చెందిన దవరసింగి వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు సోదరులు 25 కేజీల లడ్డూను గణపతికి సమర్పించారు.ఈ మేరకు వెంకన్న ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, శేషాచార్యులు ఆధ్వర్యంలో లడ్డూను వేలం పాట నిర్వహించారు.గ్రామానికి కొంకిపూడి దొరబాబు, స్వామి 2,500 రూపాయలకు స్వామివారి లడ్డును వేలం పాటలో దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాక మెరక వీధి రామాలయం వద్ద గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఊరేగించి నిమజ్జన చేశారు. భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తుల తరలివచ్చి గణపతిని వైభవంగా గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో పెద్దలు పాల్గొన్నారు.



లడ్డూని కైవశం చేసుకున్న భక్తుడు



చెక్కును అందజేస్తున్న దాతలు

వరద బాధితులకు రూ.50 వేల విరాళం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:విజయవాడ వరద బాధితులకు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ (నాన్ ట్రేడింగ్) నర్సీపట్నం అర్బన్ మరియు రూరల్ తరపున రూ. 50వేల చెక్కును అసోసియేషన్ ప్రెసిడెంట్ రుత్తల చిన్న రామమూర్తి స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జి.లక్ష్మీ నరసింహరావు, మద్దు వెంకటరమణ, చెరుకూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ శాఖ గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో చదవడం మాకు ఇష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతరత్న అవార్డు గ్రహీత ప్రముఖ ఇంజనీరు, పండితుడు రాజనీతిజ్ఞుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా జీవిత చరిత్రను చదివి వివరించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



కథను వివరిస్తున్న గ్రంథాలయాధికారి



కరాటే బెల్టులు సాధించిన విద్యార్థులు

కరాటే బెల్టుల ప్రదానం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:రైయాన్ ర్యూ ఫోటో కాన్ కరాటే డో ఇండియా ఆధ్వర్యంలో జరిగిన బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలో నర్సీపట్నం ఆర్పీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన ఎంపికైన విద్యార్థులకు బెల్టులు అందజేశారు. ఎల్లో బెల్టులు ఏడుగురు, ఆరేంజ్ బెల్టు ముగ్గురు, బ్రౌన్ బెల్టు ఇద్దరు ఎంపికయ్యారు. వీరిని అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు అభినందించారు.

17న నక్కపల్లిలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలి

ప్రజాశక్తి- నక్కపల్లి:వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు సంబంధించి అనకాపల్లి కలెక్టరేట్ లో ఈనెల 17న ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారని, అలాకాకుండా నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, వైసిపి నాయకులు వీసం రామకృష్ణ, చందనాడ సర్పంచ్ భర్త తళ్ళ భార్గవ్, ఎంపీటీసీ సభ్యులు గంటా తిరుపతిరావు, నిర్వాసితులు కోరారు. చందనాడ పంచాయతీ తమ్మయ్యపేటలో ఆదివారం సాయంత్రం నిర్వాసితులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు సంబంధించి భూములు కోల్పోయిన రైతులు, వాటిపై ఆధారపడి జీవిస్తున్న వివిధ వృత్తిదారుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించవలసి ఉందన్నారు. నిర్వాసితులను ఏ విధంగా ఆదుకుంటారో ,పునరావాసం ఎక్కడ కల్పిస్తారో, ఆర్అర్ ప్యాకేజీ, 18 సంవత్సరాలు నిండిన వారికి ఏ విధంగా ప్యాకేజీ చెల్లిస్తారో, కటాఫ్ తేదీ ఏ విధంగా ప్రకటిస్తారో, ఇంకా పరిహారం చెల్లించని డి ఫారం, సాగుదారుల సమస్యలు ఎప్పుడు పరిష్కరిస్తారో వీటన్నింటికీ అధికారులు సమాధానం చెప్పవలసి ఉందన్నారు. సమస్యలు పరిష్కరించకుండా పనులు చేపట్టడం సరికాదన్నారు.17 జరుగు ప్రత్యేక గ్రీవెన్స్ లో రాష్ట్ర హోం మంత్రి అనిత, కలెక్టర్ విజయ కృష్ణన్ హాజరవుతారని, సమస్యలు ఉంటే వారి దృష్టికి తీసుకువెళ్లాలని స్థానిక తహసీల్దార్ చెప్పడం జరిగిందన్నారు.స్థానిక నిర్వాసితులు అనకాపల్లి వెళ్లడం కష్టతరమని, ఈ మేరకు నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటుచేసి, నిర్వాసితుల నుంచి వినతులు స్వీకరించి న్యాయం చేయాలని కోరారు .ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, సిపిఎం మండల కార్యదర్శి మన బాల రాజేష్, నాయకులు సూరకాసుల గోవింద్ పాల్గొన్నారు .



మాట్లాడుతున్న సిపిఎం, వైసిపి నాయకులు

ప్రపంచ న్యాయదినోత్సవం ప్రత్యేకం

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

విశాఖపట్నం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.సత్యనారాయణ, సెక్రటరీ డి.నరేష్‌కుమార్

ప్రజాశక్తి-విశాఖపట్నం : న్యాయవాదులు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని విశాఖపట్నం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.సత్యనారాయణ, సెక్రటరీ డి.నరేష్‌కుమార్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తితో వారు మాట్లాడారు. న్యాయవాద మిత్రులందరికీ ముందుగా అంతర్జాతీయ న్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ, జిల్లా కోర్టులో న్యాయవాదుల ఆసుపత్రి నిర్మించే దిశగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. న్యాయవాదులు వృత్తిలో నిబద్ధత, నీతి, న్యాయాలతో పనిచేయాలని కోరారు. స్వాతంత్ర్య పోరాట కాలంలో మహాత్మాగాంధీ నుంచి బిఆర్.అంబేద్కర్ వరకు న్యాయవాద వృత్తిలోనే కొనసాగుతూ స్వాతంత్ర్యం, భారత రాజ్యం కోసం పోరాడారని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, సమన్యాయం కోసం న్యాయవాదులు పనిచేయాలని కోరారు. 'ఇన్ జస్టిస్ ఎనీవేర్ ఇజ్ ఎ త్రెట్ టు జస్టిస్ ఎవర్ వేర్' అని మార్టిన్ లూథర్ కింగ్ చెప్పిన మాటలను గుర్తించుకుని న్యాయ వ్యవస్థ నవ సారథులుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తమ అసోసియేషన్ ఆధ్వర్యాన గతంలో ఉచిత వైద్యశిబిరాలు, చలివేంద్రాలు ఏర్పాటుచేశామని తెలిపారు.



న్యాయవాదుల పాత్ర కీలకం

విశాఖ టిడిపి లీగల్ సెల్ పార్లమెంట్ ప్రెసిడెంట్ బత్తి రాజశేఖర్



ప్రజాశక్తి- విశాఖపట్నం : న్యాయవ్యవస్థను రెగ్యులేట్ చేయడంలో న్యాయవాదులు ప్రముఖ పాత్ర వహిస్తున్నారని విశాఖ టిడిపి లీగల్ సెల్ పార్లమెంట్ ప్రెసిడెంట్ బత్తి రాజశేఖర్ చెప్పారు. అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. మహాత్మాగాంధీ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వంటి ఎందరో మహనీయులు స్వాతంత్ర పోరాటంలో పనిచేశారని గుర్తుచేశారు. న్యాయవాదులు ఐక్యతతో చట్టాల అమలుకు మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. సమాజంలో హెచ్చుతగ్గులు, అసాంఘిక శక్తులు, హింస పెచ్చుమీరినప్పుడు కోర్టు తీర్పుల్లో న్యాయవాదుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. న్యాయవ్యవస్థను కాపాడాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందన్నారు.